
విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రూపేష్

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

బోడుప్పల్: విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ అడ్మిన్ డైరెక్టర్ రూపేష్ అన్నారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ స్కేటింగ్ పోటీల్లో భాగంగా 'గ్లెడ్ టు గ్లోరి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా వారిస్థాయి, వయస్సును అనుసరించి రోలర్ బ్లేడ్ స్కేటింగ్, క్వాడ్ స్కేటింగ్ తదితర విభాగాల్లో యు 7–9, యు 9–11, యు 11–14 మధ్య పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు వివరించారు. గెలుపొందిన వారితో పాటు ప్రతి విద్యార్థికి క్రీడల్లో స్ఫూర్తి కలిగించేలా బహుమతులను అందజేసినట్లు ఆయన తెలిపారు.

బోడుప్పల్‌లో రేబిస్ వ్యాక్సినేషన్

వరల్డ్ రేబిస్ డే సందర్భంగా టీకాలు

బోడుప్పల్: ప్రజలు కుక్కకాటుకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం అన్నారు. బోడుప్పల్‌నగర పాలక సంస్థ, బ్రూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఎన్‌జీఓ, కొల్లా బ్రేషన్ విత్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్ మిషన్ రాబిస్ అండ్ వెటర్నరీ సర్వీసెస్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం బోడుప్పల్‌లో వరల్డ్ రేబిస్‌డేను నిర్వహించారు. కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు ప్రమాదవశాత్తు కరిచిన రేబిస్ సోకకుండా ఉండేందుకు రేబిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు వివరించారు. బోడుప్పల్‌లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు కలిపి మొత్తం 325 కుక్కలకు టీకాలు వేశామన్నారు. బ్రూ క్లాస్ ఆఫ్ హైదరాబాద్ పీఎఫ్ఓ కుమారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జింబాబ్వేలోనూ లడ్డూ రూ. 10 లక్షలు..


లడ్డూ ప్రసాదంతో శ్రవణ్‌కుమార్‌రెడ్డి

ఉప్పల్: మనదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం గణేష్ లడ్డూ చరిత్ర సృష్టిస్తోంది. జింబాబ్వేలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీకి చెందిన శ్రవణ్‌కుమార్ రెడ్డి వేలం పాటలో (11111 డాలర్లు) భారత కరెన్సీలో రూ. 10 లక్షలకు పాడినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గణపతి లడ్డూను కొనుగోలు చేయడం అక్కడ రికార్డు అని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఎదులాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పర్యటన

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో వాటర్ పైప్‌లైన్, డ్రైనేజీని నిర్మించాలని స్థానికులు కోరారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. అత్యవసర సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, రవి, యుగేందర్‌గౌడ్, నరసింహా, భాస్కరయ్య, సురేశ్ తదతరులు పాల్గొన్నారు.




సఫిల్‌గూడ నిమజ్జనఘాట్ ఎంట్రెన్స్ వద్ద..

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- నేడు,రేపు మద్యం దుకాణాలు బంద్
- ట్రాఫిక్ మళ్లింపునకు ఏర్పాట్లు
- పూర్తిస్థాయిలో బందోబస్తు
- ఘాట్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘా

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో జరిగే మహా నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు ఆధ్వర్యంలో సఫిల్‌గూడ నిమజ్జనఘాట్, బండచెరువు కొలను వద్ద విగ్రహాల నిమజ్జనానికి భారీ క్రేన్‌లు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి విగ్రహాలు భారీగా తరలివస్తుండటంతో నిమజ్జనం మరుసటి రోజు ఎప్పటికప్పుడు నిమజ్జమైన విగ్రహాలను తరలిస్తున్నారు.

- జలమండలి ఆధ్వర్యంలో నిమజ్జనఘాట్ వద్ద తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. ముఖ్యమైన కూడళ్లలో తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సఫిల్‌గూడ వద్ద నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటుతో తాత్కాలికంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. ఈనెల 17న ఉదయం 6 గంటల నుంచి 18 సాయంత్రం 8 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసి ఉంటాయని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.
- మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్సైలు, 70 మంది క్రిందస్థాయి సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.



ట్రాఫిక్ డైవర్షన్ రూట్‌మ్యాప్


ఘాట్ వద్ద విగ్రహాలను తొలగిస్తున్న సిబ్బంది

దారి మళ్లింపునకు తగిన ఏర్పాట్లు : ఇన్‌స్పెక్టర్ నర్సింహ

- నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపుతో పాటు పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామని, భక్తులు, మండపాల నిర్వాహకులు సహకరించాలని సీఐ సూచించారు.
- **మెట్టుగూడ టీ జంక్షన్:** మెట్టుగూడ నుంచి మల్కాజిగిరి వైపు వచ్చే వాహనాలు లాలాపేట్ , జెస్టీసీ, ఈసీఐఎల్ వైపు వెళ్లాలి.
- **ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్:** మల్కాజిగిరి క్రాస్ రోడ్స్ నుంచి సఫిల్‌గూడకు వచ్చే వాహనాలను ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్ నుంచి ఉత్తంనగర్, జెస్టీసీ వైపుగా అనుమతిస్తారు. వినాయకనగర్ వైపు వెళ్లే వాహనాలు మౌలాలి, ఈసీఐఎల్, నేరెడ్‌మెట్ మీదుగా వెళ్లాలి.
- **ఉత్తంనగర్ ఆర్‌యూబీ:** ఏఓసీ నుంచి వచ్చే వాహనాలను ఆనంద్‌బాగ్ క్రాస్‌రోడ్స్‌కు అనుమతించరు. గౌతంనగర్–అనుటెక్స్–మల్కాజిగిరి క్రాస్‌రోడ్స్ మీదుగా వెళ్లాలి.
- బలరాంనగర్ నుంచి వచ్చే వాహనాలను విజయా డయగ్నస్టిక్స్ మీదుగా గౌతంనగర్ వైపు అనుమతిస్తారు.
- వినాయకనగర్ నుంచి వచ్చే వాహనాలను డీఏవీ స్కూల్–నలంద స్కూల్–ఈస్ట్ ఆనంద్‌బాగ్ మీదుగా అనుమతిస్తారు.
- **నేరెడ్‌మెట్ క్రాస్ రోడ్స్:** నేరెడ్‌మెట్ నుంచి సఫిల్‌గూడ వచ్చే వాహనాలను ఆర్‌కే పురం–సైనిక్‌పురి–ఈసీఐఎల్ వైపు అనుమతిస్తారు.
- **పార్కింగ్ ఏరియా:** జైన్ బాలాజీ గేటెడ్ కమ్యూనిటీ వద్ద ఓ వైపు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్‌కు అనుతిస్తారు. ఆనంద్ బాగ్ క్రాస్‌రోడ్స్ నుంచి ఉత్తంనగర్ క్రాస్ రోడ్స్ వైపు వెళ్లే మార్గంలో ఓ వైపు ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌కు అనుమతిస్తారు.
- సఫిల్‌గూడ నిమజ్జనఘాట్ వైపు గణేష్ విగ్రహాలు ఉన్న వాహనాలను తప్ప ఇతర వాహనాలను అనుమతించరు.

ఉప్పల్ బేబి పాండ్‌లో 3200 విగ్రహాల నిమజ్జనం



ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువులో ఇప్పటి వరకు దాదాపుగా 3200 వినాయక విగ్రహాలు నిమజ్జనమైనట్లు ఈఈ నాగేందర్ తెలిపారు. మూడు పీట్ల కన్న పెద్దవి దాదాపుగా 585 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నేడు దాదాపుగా మరో 300 వరకు విగ్రహాలు నిమజ్జనం కావొచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


రామంతాపూర్ గాంధీనగర్ మసీదులో..

రామంతాపూర్ : గాంధీనగర్‌లోని మజీద్ ఏ ఉస్మాన్‌లో కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రపంచంలోని యావత్ మానవజాతికి కాంతులతో సన్మార్గం చూపిన మహానీయుడు మహ్మద్ ప్రవక్త అని కొనియాడారు. మజీద్ కమిటీ ప్రతినిధులు మహ్మద్ జాహంగీర్, మహ్మద్ గౌస్‌ఖాన్, సాబ్ అఫ్జల్, రషీద్, సాదిక్, రఫీముద్దీన్, జాకీర్, అజ్జుషా, నవాజ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

అల్వాల్: కానాజిగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధూమ్రవర్ణుడి రూపంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి స్వామివారికి సుప్రభాత సేవ, లక్ష్మీగణపతిరుద్ర మృత్యుంజయ హోమాలు నిర్వహించారు.

సేవతోనే సంతృప్తి



గౌతంనగర్: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ సైనికుడు సత్యనారాయణ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని రాజానగర్ కాలనీలో పలువురు పేద మహిళలకు ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్య నిర్వహణపై అప్రమత్తం


మెడికల్ క్యాంప్‌లో వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ నిమజ్జనఘాట్ వద్ద ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారి మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించారు. పారిశుద్ధ్య నిర్వహణ, నిమజ్జమైన విగ్రహాలను జాగ్రత్తగా తరలించడం, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మెడికల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంప్‌ను ఆయన పరిశీలించారు.

కాలనీ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవం



కాప్రా: కాప్రా డివిజన్ శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ. భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కాలనీ నూతన అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సుభాష్‌రెడ్డి, శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శులుగా మురళీధర్‌రావు, సుబ్బారావు, కమిటీ సభ్యులుగా భాస్కర్‌నాయుడు, సంతోష్, కొండల్‌రెడ్డి, చిత్తరంజన్, భట్టాచార్య, ఇంద్రారెడ్డి, సురేష్, బాలు మహేంద్ర ఎన్నికయ్యారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి



మల్కాజిగిరి: ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై గణేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 4న మౌలాలి రైల్వే బ్రిడ్జి సమీపంలో 55 ఏళ్లున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. సదరు వ్యక్తిని పోలీసులు 108 ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. ఈనెల13న మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం


శ్రీకృష్ణహరి

అల్వాల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడీఎంలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసే పెనుమళ్ల శ్రీకృష్ణహరి (55), ఈనెల 13న భార్యతో గొడవపడ్డాడు. మరుసటి రోజు తెల్లవారుజామున భార్య లేచి చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య గీత నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




జై భవానీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


వేంకటేశ్వర దేవస్థానంలో..

గణపయ్య చల్లగ చూడయ్య


జీకే కాలనీలో ప్రత్యేక పూజలు చేస్తున్న మల్కాజిగిరి ఎంపీ రాజేందర్

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పలుచోట్ల అన్నదానం, లడ్డూవేలం పాటలు రికార్డు స్థాయిలో పోటాపోటీగా భక్తులు పాడి స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఆటపాటలు, సాంస్కృతిక నృత్యాల మధ్య గణపతి నిమజ్జనాలకు ఊరేగింపుగా గంగమ్మ ఒడికి చేరుస్తున్నారు.

\- ఉప్పల్ మల్కాజిగిరి జోన్ బృందం


చెంగిచెర్లలో గణేష్ మండపం వద్ద వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి


అన్నదానంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి


నెహ్రూనగర్ వినాయక మండపంలో..


కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి


ఊరేగింపుగా నిమజ్జన ఘాట్‌కు..


రూ.1,30,000లకు దక్కించుకున్న బాల్‌రెడ్డి


ఆర్‌కే రెసిడెన్సీలో రూ.63,000లకు దక్కించుకున్న సుదర్శనాచారి

పోటా పోటీగా లడ్డూ వేలం..

గణపతి మండపాల్లో సోమవారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో లడ్డూ ధర రికార్డు స్థాయిలో పలికింది. స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకోవడానికి కాలనీవాసులు, స్థానికులు పోటీపడ్డారు.


మార్కండేయనగర్‌లో రూ.5.31 లక్షలకు దక్కించుకున్న జీవీఎస్‌రావు


హబ్సిగూడలో రూ.2,51,000కు దక్కించుకున్న ప్రవీణ్‌రెడ్డి


రూ.80,000 పెంబల్ల కుమార్‌యాదవ్


రూ.87,000లకు స్వాతి, నరేష్ దంపతులు

తుదిదశకు గణపతి నవరాత్రి ఉత్సవాలు


భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత తోరణం

కాప్రా: గణేష్ నవరాత్రి ఉత్సవాలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి కాప్రా చెరువుకు బయలుదేరుతున్నాయి. చెరువు వద్ద నిమజ్జనాల కోసం 5 భారీ క్రేన్లు ఏర్పాటు చేశారు. ఇందులో 3 భారీ క్రేన్లు చెరువులో పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు, మరో మూడు క్రేన్లు పక్కనే ఉన్న కొలనులో చిన్న విగ్రహాలకోసం ఉపయోగిస్తున్నారు.

- నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు.
- కాప్రా చెరువు వద్దకు వచ్చే గణనాథుల కోసం భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత తోరణం ఏర్పాటు చేశారు. గణనాథులతో వచ్చే భక్తులకు వేదికపై సాంప్రదాయ నృత్యాలతో వారికి స్వాగతం పలుకుతున్నారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన ఈ వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

కోలాహలంగా కాప్రా చెరువు..

నిమజ్జనాలు చూసేందుకు వస్తున్న భక్తులతో కాప్రా చెరువు కోలాహలంగా మారింది. చిన్న, పెద్ద అని తేడా లేకుండా భక్తులతో కిక్కిరిపోతుంది. సాయంత్రం వేళలలో భక్తుల తాకిడి పెరిగిపోతుండటంతో చిన్నారుల కేరింతలు, గణపతి నినాదాలతో కాప్రా చెరువు పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

మట్టి గణనాథులనే ప్రతిష్టిస్తామంటున్న భక్తులు..

నిమజ్జనానికి తీసుకొచ్చే గణనాథులను నిమజ్జనం చేసి వెంటనే వాటిని తొలగిస్తుండటంతో భక్తులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. వచ్చే ఏడాది మట్టి గణనాథుడిని ఏర్పాటు చేసుకుని, ఇళ్లల్లోనే నిమజ్జనం చేసి ఆ మట్టిని చెట్లకు వాడుతామని చర్చించుకుంటున్నారు.

విగ్రహ నిమజ్జనాలు..

కాప్రా చెరువులు ఇప్పటి వరకు 1500లకు పైగా విగ్రహాలు నిమజ్జనం అయినట్లు అధికారులు ప్రకటించారు. మొదటి మూడ్రోజుల్లో 127 పెద్ద విగ్రహాలు నిమజ్జనమైతే.. వాటిలో 30 మట్టి గణనాథులు, నాల్గోరోజు పీఓపీ 19, మట్టి గణనాథులు–1, ఐదో రోజు పీఓపీ– 281, మట్టి గణపతులు– 36, ఆరో రోజు పీఓపీ 140, మట్టి గణపతులు– 21, ఏడో రోజు పీఓపీ–70, మట్టిగణపతులు–3, 8వ రోజు పీఓపీ–236, మట్టిగణపతులు– 6, తొమ్మిదో రోజు పీఓపీ 498, మట్టిగణపతులు 45 వచ్చినట్లు అధికారులు స్పష్టం చేశారు.


కాప్రా చెరువు వద్ద నిమజ్జన కోలాహలం..